# సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 4 । ఆగస్టు । 2025




## గ్యాస్ సిలిండర్ లీకేజీ



ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయి మంటలు వ్యాపించిన ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బోథ్ మండలం పిప్పల్‌ధరిలో ఈ ఘటన చోటు చేసుకుంది.

8లో▸



## మొక్కలు నాటి సంరక్షించాలి

ఆదిలాబాద్: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐవీ స్టేడియంలో ఆదివారం మొక్కలు నాటారు. ఇందులో డీవైఎస్‌వో శ్రీనివాస్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

## న్యూస్‌రీల్

### 'వర్సిటీ' ఆవశ్యకతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోయూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ యూనివర్సిటీ సాధన సమితి జిల్లా కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి అన్నారు. వర్సిటీ సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లైబ్రెరీలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూనివర్సిటీ లేకపోవడంతో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు.ఆర్థికంగా లేనివారు మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. విద్యార్థినులు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక డిగ్రీకే పరిమితమవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుందన్నారు.విద్యార్థులంతా వర్సిటీ సాధన కోసం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కోకన్వీనర్ రమణాగౌడ్, సుహాసినిరెడ్డి, ఉదారి నారాయణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### 'పాలిటెక్నిక్'లో స్పాట్ అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాంబాబు ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, పాలిసెట్ రాసిన, రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

### జిల్లాకేంద్రంలో మోస్తరు వర్షం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది. అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో వాహనదారులు, పట్టణంలోని చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. నాలుగైదు రోజులుగా వర్షాలు లేక ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించినట్లయింది.


### జిల్లాకు చేరని అప్రెంటిషిప్ జాబితా

కైలాస్‌నగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్ల రాత పరీక్షలో ప్రతిభ చాటిన అభ్యర్థులకు ఈనెల 4 నుంచి అప్రెంటిషిప్ శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆ పరీక్షకు సంబంధించిన ఫలితాలు ఇప్పటివరకు వెల్లడించలేదు. దీంతో సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుందా.. అయితే ఎంత మందికి ఇస్తారనేది అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో 56 రోజులపాటు 155 మంది అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ కల్పించారు. గతనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించిన పరీక్షలకు 129 మంది హాజరయ్యారు. ప్రభుత్వం నేటి నుంచి అప్రెంటిషిప్ కల్పిస్తామని ప్రకటించడంతో పరీక్షకు హాజరైన ఎంత మందిని ఎంపికచేస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ విషయమై జిల్లా సర్వేల్యాండ్ రికార్డ్ ఏడీ రాజేందర్‌ను సంప్రదించగా, తాను హైదరాబాద్‌లో ఉన్నానని తెలిపారు.పరీక్ష ఫలితాల జాబితా రెండు, మూడు రోజుల్లో జిల్లాకు రానుందని, అర్హులైన వారి వివరాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### టీచర్ల సర్టిఫికెట్లు పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్:ఉపాధ్యాయుల పదోన్నతి ప్రక్రియలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం డీఈవో కార్యాలయంలో ఆదివారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. సీనియారిటీ జాబితా మేరకు 1:3 ప్రకారం టీచర్ల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇందుకోసం ప్రత్యేకబృందాన్ని నియమించారు. ప్రభుత్వ, లోకల్‌బాడీకి చెందిన ఎస్జీటీ క్యాడర్ ఉపాధ్యాయులు 210 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ఉదయ్‌రావ్, సుకుమార్, ఆశన్న, గిరిధర్, వేణుగోపాల్, శ్రీహరిబాబు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ఆదిలాబాద్:ఆదిలాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌పోటీల్లో సత్తాచాటారు. హన్మకొండ వేదికగా నిర్వహిస్తున్న 11వ తెలంగాణ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ పోటీల్లో ట్రయథ్లాన్-ఏ ఈవెంట్‌లో ఎస్.చరణ్ స్వర్ణ పతకం సాధించగా, జావెలిన్ త్రోలో వీ.మహేశ్ కాంస్య పతకం సాధించినట్లు కోచ్ రమేశ్ తెలిపారు. అలాగే జిల్లాకు చెందిన కే.జకేశ్ జావెలిన్ త్రోలో గోల్డ్‌మెడల్‌తో మెరువగా,రేస్‌వాక్‌లో కార్తీక్, రమ్య కాంస్య పతకాలతో సత్తాచాటినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు భోజారెడ్డి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

- జిల్లా కేంద్రంలోని నక్షత్ర ఆస్పత్రిని కలెక్టర్ రాజర్షిషా ఇటీవల తనిఖీ చేశారు. పలు లోపాలు ఉండదంతో యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి రూ.20వేల జరిమానా విధించారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో గల ఓ నర్సింగ్ హోమ్‌లో ఇటీవల నవజాత శిశువు మరణించింది. యాజమాన్యం సుఖప్రసవం చేస్తామని చెప్పడంతో గర్భిణి కుటుంబ సభ్యులు ఇందులో చేర్పించారు. పుట్టిన శిశువు మరణించడంతో కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత సర్దిచెప్పడంతో ఈ వ్యవహారం బయటకు రాలేదు.
- జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో గల సాయిరాం క్లినిక్‌ను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఆయుర్వేద డాక్టర్ అలోపతి వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలు పాటించడం లేదని, ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. అలాగే పట్టణంలో మరో నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు.

# ప్రైవేట్ ఆస్పత్రులపై కొరడా



ఓ ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

### నిబంధనలు పాటించకుంటే చర్యలు



కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరుగురు ప్రోగ్రాం అధికారులతో తనిఖీలు చేపడుతున్నాం. నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటున్నాం. ఈఏడాది 12 ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశాం. రూ.80వేల జరిమానా విధించాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

- కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- ఆరుగురు ప్రోగ్రాం అధికారులతో తనిఖీలు
- నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు

**దందాగా మారిన వైద్యం..**

జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్యాన్ని దందాగా మార్చేశారు. కొంత మంది వ్యక్తులు వైద్యులను ఏర్పాటు చేసుకొని క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ల్యాబ్‌లు, మెడికల్ షాపుల ద్వారా ఆస్పత్రుల నిర్వహణ చేపడుతున్నారు. రిమ్స్‌లో పనిచేస్తున్న కొంత మంది వైద్యులతో ఒప్పందం చేసుకుని దందా సాగిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఆదిలాబాద్‌టౌన్: కలెక్టర్ రాజర్షిషా ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా పెట్టారు. నిబంధనలు పాటించని వాటిపై కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి చర్యలకు పూనుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిని ఏర్పాటు చేస్తున్న వారిలో రిమ్స్ వైద్యులే అధికంగా ఉండడం గమనార్హం. రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నప్పటికీ పేదలకు సరైన వైద్యసేవలు అందించలేక పోతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రైవేట్‌లో ప్రాక్టీస్ చేస్తూ రోగుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. ల్యాబ్ పరీక్షలు, మందుల పేరిట దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా రోగుల ఆరోగ్యం మాత్రం కుదుటపడటం లేదు. నిబంధనలు గాలికొదిలేస్తూ ఇష్టారీతిన ఆస్పత్రుల నిర్వహణ చేపడుతున్నారు. క్లినిక్‌ల ఎదుట పార్కింగ్‌కు స్థలం లేకపోవడం, అర్హత లేని వారితో ల్యాబ్‌లు, మెడికల్ షాపుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఇలాంటి ఆస్పత్రులపై కలెక్టర్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఇటీవల ఓ ఆస్పత్రిని తనిఖీ చేయగా, పలు లోపాలు ఉండడంతో జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో ఆదేశాలతో ఆరుగురు ప్రోగ్రాం అధికారులు అన్ని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నారు.

**నిబంధనలకు పాతర..**

జిల్లాలో 60 ఓపీ క్లినిక్‌లు, 18 డయగ్నోస్టిక్ సెంటర్లు, 75 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. చాలా ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడం లేదు. అనుమతి ఒకరి పేరిట.. నిర్వహణ మరొకరి పేరిట కొనసాగుతున్న ఆస్పత్రులు ఉన్నాయి. బయో మెడికల్ వేస్టేజీ కోసం ఏటా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తక్కువ బెడ్లకు అనుమతి తీసుకొని ఎక్కువ పడకలు ఏర్పాటు చేస్తున్నారు. అర్హత గల సిబ్బందితో వైద్యసేవలు అందించాల్సి ఉండగా, అనర్హులతోనే కొనసాగిస్తున్నారు. ఇతరుల పేరిట ల్యాబ్ అనుమతి ఉండగా, మరో టెక్నీషియన్ ద్వారా పరీక్షలు చేయిస్తున్నారు. మెడికల్ షాప్‌ను ఫార్మసి చదివిన వారు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే పదో తరగతి, ఇంటర్ చదివిన వారే వీటిని నిర్వహించడం గమనార్హం. విజిటింగ్ డాక్టర్‌కు సంబంధించి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. ధరల పట్టిక ఏర్పాటు చేయాలి. ఆస్పత్రి ఎదుట పార్కింగ్ స్థలం కల్పించాలి. రోగుల కోసం మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. అయితే చాలా ఆస్పత్రుల్లో ఇవేమి కానరావడం లేదు. తాజాగా నిర్వహిస్తున్న తనిఖీల్లో ఇవి బయటపడుతున్నాయి. నిబంధనలు పాటించని వాటికి నోటీసులు అందజేసి చర్యలు చేపడుతున్నారు.

# గాడితప్పిన పల్లె పాలన

- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు
- విధులకు డుమ్మా కొడుతున్న కార్యదర్శులు
- పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

| జిల్లాలో.. |
|---|
| గ్రామ పంచాయతీలు : 473 |
| రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు : 417 |
| కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు : 31 |



నీటి సమస్యపై ఇటీవల తాంసి మండలం పొన్నారిలో రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

కైలాస్‌నగర్: పంచాయతీ ప్రత్యేకాధికారులు పల్లెల ముఖం చూడటం లేదు. గ్రామాలను విధిగా సందర్శిస్తూ పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా తమకేం సంబంధంలేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న పలువురు కార్యదర్శులు విధులకు డుమ్మా కొడుతున్నారు. దీంతో పంచాయతీ పాలన పూర్తిగా గాడి తప్పింది.

**సంతకాల కోసమే అన్నట్లుగా..**

పంచాయతీ పాలకవర్గాల గడువు గతేడాది జనవరి 31న ముగిసింది. దీంతో ప్రత్యేకాధికారుల పాలన అనివార్యమైంది. జిల్లాలో 123 మంది వివిధ శాఖల గెజిటెడ్ అధికారులను పంచాయతీ స్పెషలా ఫీసర్లుగా నియమించారు. ఇందులో ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, ఎంఈవోలు, పీఆర్ఏఈలు, సూపరింటెండెంట్లు, ఏంఏఓలు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, వాటర్‌గ్రిడ్ ఏఈలు వంటి అధికారులున్నారు. కొన్ని మేజర్ పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వీరు పంచాయతీల ముఖమే చూడటం లేదు. నెలలో కనీసం ఒకటి, రెండు సార్లు సందర్శించిన దాఖలాలు సైతం కనిపించడం లేదు. జిల్లా కలెక్టర్ పర్యటించిన సమయాల్లో మాత్రమే ఆ గ్రామాలకు వస్తున్నారనే ఆరోపణలున్నాయి. కేవలం సంతకాల కోసం మాత్రమే ఉన్నారన్నట్లుగా వీరు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువై పంచాయతీ పాలన గతితప్పుతోంది.

**విధులకు కార్యదర్శుల డుమ్మా ..**

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలువురు కార్యదర్శులు విధులకు గైర్హాజరవుతున్నారు. ఉదయమే గ్రామానికి చేరుకుని పంచాయతీ మానిటరింగ్ యాప్‌లో ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ఫొటో అప్‌లోడ్ చేసి అటెండెన్స్ నమోదు చేయాలి. కానీ జిల్లాలో చాలామంది విధులకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తున్నారు. తమ ముఖాలకు బదులు పంచాయతీలోని కుర్చీలు, బీరువాలు,టేబుళ్లు,పంచాయతీ పరిసరాలు నమోదు చేస్తూ అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారు. విధులకు రాకుండా ప్రైవేట్ దందాలు నిర్వహిస్తున్నారు. వీరి హాజరును పర్యవేక్షించాల్సిన ఎంపీవోలు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణ ఉన్నాయి. ఫలితంగా పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తప్పడం లేదు.

**తొమ్మిది మంది ఎంపీవోలు.. 26 మంది కార్యదర్శులపై చర్యలు**

విధులకు రాకున్నా వచ్చినట్లుగా తప్పుడు హాజరు నమోదు చేసిన కార్యదర్శులపై పంచాయతీరాజ్ కమిషనరేట్ చర్యలు చేపట్టేదాకా జిల్లా అధికారులకు విషయం తెలియదంటే పర్యవేక్షణ ఏ విధంగా ఉందనేది స్పష్టమవుతుంది. జిల్లాలో స్థానిక సంస్థల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ ఐఏఎస్ అధికారితో పాటు జిల్లా పంచాయతీ అధికారి, ఇద్దరు డివిజనల్ పంచాయతీ అధికారులు ఉన్నారు. ఎంపీవోలు సైతం తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇంత మంది అధికారులు ఉండగా కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తుంటే వీరంతా ఏం చేస్తున్నారనే సందేహం కలుగుతోంది. జిల్లాలో 9మంది ఎంపీవోలకు, 21 మంది కార్యదర్శులకు నోటీసులు జారీచేయగా, మరో నలుగురు కార్యదర్శులకు చార్జీమెమోలు ఇచ్చారు. అలాగే ఓ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడింది. లోతుగా విచారిస్తే మరింత మంది బయటపడే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

### కఠినంగా వ్యవహరిస్తాం

పంచాయతీలను సందర్శించి సమస్యలను పరిష్కరించేలా చూడాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారులపై ఉంటుంది. వారు సందర్శించడం లేదనే విషయం నా దృష్టికి రాలేదు. కార్యదర్శుల పనితీరుపై దృష్టి సారిస్తాం. విధులకు గైర్హాజరయ్యే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

– జి.రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

# వంద సీట్లు గెలుస్తాం

- రెండోసారి అధికారంలోకి వస్తాం..
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- ఖానాపూర్‌లో 'జనహిత' పాదయాత్ర
- భారీగా తరలివచ్చిన నేతలు, శ్రేణులు
- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి, పలువురు మంత్రులు హాజరు



పాదయాత్రలో మీనాక్షి నటరాజన్‌తో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు జూపల్లి, సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు తదితరులు

నిర్మల్/ఖానాపూర్: సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమా పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 100 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అన్ని సీట్లూ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంజేశారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క తదితరులతో ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జనహిత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే రాష్ట్రంలో ఆరుగ్యారంటీలు,ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం లాంటి హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. తాముఏసీల్లో కూర్చోకుండా తమనేత రాహుల్‌గాంధీ చెప్పినట్లు ప్రజల్లో ఉండేందుకే జనహిత పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లాను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తామన్నారు.

**ఆదివాసీలతో అనుబంధం ఉంది : మీనాక్షి**

మళ్లీ తనకు జన్మంటూ ఉంటే ఆదివాసీగానే పుట్టాలని కోరుకున్న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలు, ప్రజలతో ఎప్పుడూ దగ్గరగా ఉంటే వారి సమస్యలు ఎక్కువగా పరిష్కరించవచ్చన్న తమనేత రాహుల్‌గాంధీ ప్రేరణతో కాంగ్రెస్‌ప్రభుత్వం పని చేస్తోందని పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. తనకు ఆదివాసీలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్‌తోనూ అనుబంధం ఉందని పేర్కొన్నారు. గతంలోనూ సర్వోదయ యాత్రలో భాగంగా ఆదిలాబాద్‌కు వచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఆదివాసీ సమాజం నుంచి మంచితనాన్ని నేర్చుకున్నట్లు చెప్పారు. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన ఆదివాసీలే తమకు స్ఫూర్తి అన్న రాహుల్ ఆశయాలతోనే ముందుకు సాగుతామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. బనకచర్లపై బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని, అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు.. మన నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు దోచిపెట్టారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు చిలుకపలుకులు పలుకుతున్నారని,గతంలో మూడు రాష్ట్రాలను ఇచ్చి, తెలంగాణకు మొండిచేయి చూపారని ఆరోపించారు. తెలంగాణలో ఓటు అడిగే హక్కు బీజేపీ, బీఆర్ఎస్‌కు లేదని, దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందని, అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎలా దోపిడీ జరిగిందో, ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పని చేస్తోందో ప్రజలకు తెలుపుతూ.. సమస్యలు పరిష్కరించేందుకేజనహిత పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ దోపిడీకి పాల్పడితే, బీజేపీ ప్రజల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రేషన్‌కార్డులు ఇస్తూ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగి అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో జీవోలే తప్పా పైసలు ఇవ్వలేదని, అభివృద్ధికి నోచుకోలేదని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి ఎద్దేవా చేశారు. గత సీఎం కేసీఆర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా సదర్‌మట్ మినీబ్యారేజీ నుంచి ప్రత్యేక కాలువ ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ మండిపడ్డారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, నాయకులు అల్లూరి మల్లారెడ్డి, ఆడె గజేందర్, కంది శ్రీనివాస్, బొంత రామ్మోహన్, నారాయణరావుపటేల్, పడిగెల భూషణ్, ఎంఏ మజీద్, దయానంద్, తోట సత్యం, చిన్నం సత్యం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 'సర్దుబాటు' ఆదేశాలు బేఖాతరు

- విధుల్లో చేరని పలువురు ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: డీఈవో, మండల విద్యాధికారుల ఆదేశాలను కొంత మంది ఉపాధ్యాయులు బేఖాతరుచేస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా వారికి కేటాయించిన పాఠశాలకు వెళ్లి రిపోర్టు చేయాల్సి ఉంది. అయితే గతనెల 15న సర్దుబాటు ప్రక్రియ పూర్తి కాగా, కొన్ని లోపాలతో ఆ ప్రక్రియను మళ్లీ సరిదిద్దారు. నాలుగు రోజుల క్రితం ఇందుకు సంబంధించి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత మండల విద్యాధికారులు సర్దుబాటైన ఉపాధ్యాయులకు వివరాలను పంపించారు. అయినప్పటికీ చాలా మంది తాము పనిచేస్తున్న పాతపాఠశాలల్లోనే ఉంటున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఉపాధ్యాయులు లేని పాఠశాలల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే బడులు ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. జూలై మొదటి వారంలోనే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా, ఎంఈవోలు జాబితా తయారీలో జాప్యం చేశారు. దీంతో ఈప్రక్రియ ఆలస్యమైంది. అయితే సర్దుబాటు ఉత్తర్వులు జారీ అయినప్పటికీ చాలామంది ఉపాధ్యాయులు అధికారుల ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారు. ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ నాయకులతో అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. తాము పనిచేస్తున్న పాఠశాలల్లోనే కొనసాగించేలా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అయితే కొంతమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లేకపోయినా అధికంగా చూపించి సర్దుబాటు నుంచి తప్పించుకునే యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని వివరణకోరగా.. సర్దుబాటు ప్రక్రియ ద్వారా ఇతర పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు రిపోర్టు చేయాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## క్లుప్తంగా

### గుడుంబా పట్టివేత

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామ శివారులో గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం ఉదయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన దారావత్ తారాచంద్ బైక్‌పై గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. అతని వద్ద 8 లీటర్ల గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. సిబ్బంది మధు, విజయ్, మహ్మద్, రమేశ్ ఉన్నారు.

### వ్యక్తి చెయ్యి పైనుంచి వెళ్లిన లారీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లిలో ఓ వ్యక్తి శనివారం రాత్రి ఆగి ఉన్న లారీ కింద సేద తీరాడు. లారీ మరమ్మతులో ఉండగా మెకానిక్ వచ్చి దాన్ని ముందుకు జరిపాడు. లారీ కింద పడుకున్న వ్యక్తి చెయ్యి పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. స్థానికులు అతన్ని రిమ్స్‌కు తరలించగా వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

### గంజాయి మొక్కలు స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ పంచాయతీ పరిధి చిన్న చించుఘాట్‌లో మెంగౌరావ్ ఇంటి పెరట్లో పెంచిన గంజాయి మొక్కలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి 24 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### పటిక, నల్లబెల్లం పట్టివేత



పట్టుకున్న పటిక, నల్లబెల్లంతో ఎక్సైజ్ అధికారులు

పెంబి:నాటుసారాకు ఉపయోగించే పటిక, నల్లబెల్లాన్ని మండల కేంద్రంలో ఆదివారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు తెలి పారు. పెంబికి చెందిన అంగ గంగాధర్ అనే కిరాణదారుడు ఇంటి ముందు ఉన్న రేకులషెడ్డులో 1.98 క్వింటాల్ నల్ల బెల్లం, 4 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది గౌతమ్, రవీందర్, కల్పన ఉన్నారు.

### కుక్కలదాడిలో మేక పిల్లలు మృతి



మృతిచెందిన మేక పిల్లలు

తానూరు(ముథోల్): వీధి కుక్కల దాడిలో 8 మేక పిల్లలు మృత్యువాతపడ్డాయి. ముథోల్‌లోని ముక్తాదేవి గల్లీలో పెద్ద గంగాధర్ శనివారం రాత్రి తన మేకలను కొట్టంలో ఉంచి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం అక్కడికి వెళ్లగా మేక పిల్లలు మృతిచెంది ఉన్నాయి. కుక్కల దాడిలో మృతిచెందాయని బాధితుడు తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

### ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

దహెగాం: మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఎనిమిది మందిపై ఆదివారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పంచాయితీ విషయమై మండలంలోని మొట్లగూడకు చెందిన కనక పాపయ్యను ఎనిమిది మంది కులం పేరుతో దూషించారు. దీంతో పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మొట్లగూడకు చెందిన చౌదరి సంజీవ్, గంగాధర్, చౌదరి బాణయ్య, జిల్లెడ వెంకటేశ్, ఎండీ ఇర్ఫాన్, చౌదరి రాకేశ్, వగాడె శంకర్, కర్జి గ్రామానికి చెందిన చౌదరి సురేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గ్యాస్ సిలిండర్ లీకేజీ

- ఇంట్లో వ్యాపించిన మంటలు
- ఏడుగురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న వ్యక్తి

బోథ్: ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయి మంటలు వ్యాపించి ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. సోనేరావు ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకేజీ అయింది. కుటుంబీకులు గమనించి సోనేరావుతోపాటు ఆయన కుమారుడు గంగ ప్రసాద్ లోనికి వెళ్లి చూశారు. సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. ఇంటి పక్కన ఉన్న వారి కుటుంబీకులు లక్ష్మణ్, చందు, బాపూరావు, మహేశ్, లక్ష్మి ఇంట్లోకి వెళ్లి చూడగా మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో వారికి మంటలు అంటుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. వారి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేశారు. గాయపడ్డ వారిని బోథ్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో రిమ్స్‌కు తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

# ఇక ఇంటర్‌లో ముఖగుర్తింపు

- నిలిచిన బయోమెట్రిక్ సేవలు
- కళాశాలల్లో విద్యా సంస్కరణలు
- విద్యా నాణ్యత పెంపొందించే చర్యలు
- ఆధునిక సాంకేతికతతో హాజరు పర్యవేక్షణ



ఇంటర్‌లో బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థిని (ఫైల్)

మంచిర్యాలఅర్బన్:ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే పాఠశాలల్లో అనేక మార్పులు చేసింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు విషయంలో ఫేషియల్ రికగ్నేషన్ అమలు చేస్తోంది. పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించింది. ఇక, జూనియర్ కళాశాలల్లోనూ సంస్కరణలపై దృష్టి పెట్టింది. జూనియర్ కళాశాలల్లో బోధనా పద్ధతులు, హాజరు పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకే తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక విద్యార్థులు, అధ్యాపకుల హాజరు కోసం ముఖ గుర్తింపు హాజరు నమోదుకు కసరత్తు చేస్తోంది. ఈ సంస్కరణలు విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి దోహదపడనున్నాయి.

**ఆధునిక సాంకేతికతతో హాజరు..**

ప్రస్తుతం జూనియర్ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల హాజరును బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేస్తున్నారు. అయితే, 20 రోజులుగా కేంద్ర ప్రభుత్వ యుడాయి సంస్థతో ఒప్పందం ముగియడంతో నెట్‌వర్క్ సమస్యలు, బ్యాటరీ లోపాలు వంటి సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిని అధిగమించేందుకు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ముఖ గుర్తింపు సాంకేతికత (ఎఫ్‌ఆర్‌ఎస్‌)ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థ హాజరు నమోదులో కచ్చితత్వాన్ని, సమయపాలనను నిర్ధారిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

**సీసీ కెమెరాలతో పర్యవేక్షణ..**

ఉమ్మడి జిల్లాలో 49 కళాశాలలు ఉన్నాయి. వీటిలో 20,083 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికే కళాశాలల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ప్రతీ క్లాస్‌రూమ్, ల్యాబ్, ప్రిన్సిపాల్ గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాలు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించబడతాయి. దీంతో హైదరాబాద్ నుంచి అధికారులు తరగతులు, బోధనా పద్ధతులు, సమయపాలనను పర్యవేక్షిస్తారు. ఇంటరాక్టివ్ సీసీ కెమెరాలు లోపాలను సవరించుకోవడానికి మరియు బోధన నాణ్యతను మెరుగుపరచడానికి సహాయపడతాయి.

**బయోమెట్రిక్‌లో సాంకేతిక సమస్య..**

గతంలో అమలు చేసిన బయోమెట్రిక్ విధానంలో నెట్‌వర్క్ సమస్యలు, సిమ్ లేదా బ్యాటరీ లోపాలు వంటి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు ముఖ గుర్తింపు సాంకేతికత అమలు చేయడం ఒక వినూత్న చర్య. ఈ విధానం హాజరు నమోదులో పారదర్శకతను పెంచడంతోపాటు, సాంకేతిక లోపాలను తగ్గిస్తుందని భావిస్తున్నారు. ఈ కొత్త విధానం విజయవంతంగా అమలు కావాలంటే, సిబ్బంది, విద్యార్థులకు తగిన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు అవసరం.

జిల్లాల వారీగా కళాశాలలు, విద్యార్థుల వివరాలు..

| జిల్లా | ప్రభుత్వ కళాశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| మంచిర్యాల | 10 | 4,320 |
| నిర్మల్ | 15 | 4977 |
| ఆదిలాబాద్ | 13 | 6,606 |
| ఆసిఫాబాద్ | 11 | 4180 |

## ఆదివాసీ దినోత్సవానికి తరలిరావాలి



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ తొమ్మిది తెగల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా కుమురం భీం గూడ నుంచి భారీ ర్యాలీతో ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, డోలు, సన్నాయి, కాలికోమ్ పేప్రే తుడుం వాయిద్యాలతో భారీ ర్యాలీగా ఆదిలాబాద్‌లోని కుమురం భీం చౌక్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం సభకు చేరుకుని ఆదివాసీల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జయవంత్‌రావు, ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పరాణి, ఉపాధ్యక్షురాలు ఇందిరా, నాయకులు రాజు, గణపతి, విష్ణు, రజినీకాంత్, సొనేరావు, భుజంగ్‌రావు పాల్గొన్నారు.

**గాదిగూడలో నిర్వహించాలి**

నార్నూర్: ఆదివాసీ దినోత్సవాన్ని గాదిగూడ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని గొండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడి జుగ్నాక భీంరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ పేర్కొన్నారు. గాదిగూడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ వేడుకలు జరుపుకోవాలన్నారు. ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు గణేశ్, జిల్లా కోశాధికారి మహేందర్, గ్రామపటేల్ నాగోరావు, గ్రామపెద్దలు లింబారావు, మారోతి, మాడవి మాన్కు, ఆత్రం మాన్కు, మాజీ సర్పంచ్ జైవంతరావు పాల్గొన్నారు.

**ఆదివాసీ విద్యార్థి సంఘం కార్యవర్గం..**

ఆదివాసీ విద్యార్థి సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మెస్రం కేశోరావు, అధ్యక్షుడిగా పెందూర్ మధు, ప్రధాన కార్యదర్శిగా మెస్రం వామన్, ఉపాధ్యక్షుడిగా కుడ్మేత రామేశ్వర్, సలహాదారుడు సాక్కర్ శంకర్, కోశాధికారిగా టెకం అయ్యు, ప్రచార కార్యదర్శిగా కోట్నాక్ శ్యామ్‌రావు, సాంస్కృతిక సలహాదారుగా కుంరం హన్మంతరావు, సభ్యులుగా హెచ్‌కే మారు, ఆత్రం భీంరావు, చిక్రం తిరుపతి ఎన్నికయ్యారు.

## కట్టుకున్నోడే కడతేర్చాడు..

- భార్యను కొట్టి చంపిన భర్త
- మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధింపులు
- పోలీసుల అదుపులో నిందితుడు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ వెంకటేశ్వర్



పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్



రాజమణి (ఫైల్)



పోలీసుల అదుపులో నిందితుడు రాజయ్య

జైపూర్: చివరి వరకు తోడుగా ఉంటానని బాసచేసిన భర్తే కాలయముడయ్యాడు. కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా హత్యచేశాడు. మద్యం మత్తులో అతిదారుణంగా కట్టెతో కొట్టి చంపాడు. మండలంలోని నర్వ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన రాజమణి(48), నర్వ గ్రామానికి చెందిన గోదారి రాజయ్యను ప్రేమించి వివాహం చేసుకుంది. వీరికి ఒక్క కుమార్తె పూజిత ఉంది. రాజమణి..నర్వ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుండగా రాజయ్య సింగరేణిలో సపోర్టుమెన్‌గా పనిచేసి 2020న రిటైర్డ్ అయ్యాడు. కొంతకాలంగా రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. వచ్చిన పెన్షన్ డబ్బులతో మద్యం తాగుతూ ఇంకా డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవపడేవాడు. తరచూ మద్యం తాగి భార్యను వేధించేవాడు. ఎప్పటికైనా ఆమెను చంపుతానని బెదిరించేవాడు. శనివారం మద్యం తాగిన రాజయ్య భార్య రాజమణితో రాత్రి గొడవపడ్డాడు. ఇంట్లో నిద్రిస్తున్న ఆమెను ఆదివారం ఉదయం కట్టెతో తలపై, శరీరభాగాలపై కొట్టి హత్యచేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడు రాజయ్యను అదుపులో తీసుకున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతురాలి కుమార్తె పూజిత కాగా ఆమె శ్రీరాంపూర్‌కు చెందిన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది.

## బాసర క్షేత్రంలో ఎర్రజెండాలు కలకలం



డార్మెటరీ హాల్‌లో ఎర్రజెండాలతో అతిథి గృహం

బాసర: జ్ఞాన సరస్వతి క్షేత్రంలో సీపీఐ(ఎం) ఎర్రజెండాలు శనివారం రాత్రి వెలుగుచూశాయి. ఆలయ సమీపంలోని 6వ నంబర్ గది డార్మెటరీ హాల్ అతిథి గృహంలో ఎర్రజెండాలు గుర్తుతెలియని వ్యక్తులు పెట్టడం కలకలం రేపాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి వాటిని తొలగించారు. ఎర్రజెండాలు ఎందుకు పెట్టారో ఆలయ అధికారులు స్పందించకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## కుటుంబ భరోసా ప్రతిఒక్కరికీ అందించడమే లక్ష్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కుటుంబ భరోసా పథకం ప్రతిఒక్కరికీ అందడమే లక్ష్యంగా యూనియన్ కృషి చేస్తుందని ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే.హుస్సేన్ అన్నారు. ఆదివారం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు అప్పాసు రాము, ప్రధాన కార్యదర్శి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర స్వామితో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు ఫొటో మాంత్రికుడు డ్యాగురే చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం హుస్సేన్ మాట్లాడుతూ యూనియన్ నుంచి నీట్, ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు, కుటుంబ పెద్ద మరణిస్తే పిల్లలకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా కుటుంబ భరోసా పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఆర్థికసాయం అందుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, ఉపాధ్యక్షులు మహేశ్, ఉదయ్, మహిళా అధ్యక్షురాలు జయమాధురి, ఉపాధ్యక్షురాలు ఆశాల శారద, దక్షిణ భారత ప్రతినిధి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ గౌరవ అధ్యక్షుడు ఎంకే.రాము, మాజీ ఉపాధ్యక్షుడు కనకయ్యగౌడ్, ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లాలోని ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

### 'పంచమి' ఆవిష్కరణ

మంచిర్యాలక్రైం: గంజాయి సేవించడం వలన కలిగే దుష్పరిణామాలపై అక్షయ ఆర్ట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మించిన 'పంచమి' షార్ట్ ఫిల్మ్‌ను డీసీపీ భాస్కర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కర్రె తిరుపతి, నిర్మాత బోడకుంట రవీందర్ షార్ట్ ఫిల్మ్ కథను వివరించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ గంజాయి సేవించడంతో కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచేలా షార్ట్‌ఫిల్మ్ రూపొందించడం అభినందనీయమన్నారు. గంజాయి సేవించే వారిలో యువతే ఎక్కువగా ఉందని, గంజాయి రహిత కమిషనరేట్‌గా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో చిత్ర యూనిట్ సిబ్బంది, డీవోపీ దుర్గం విజయ్, కుమార్ పాల్గొన్నారు. ప్రధాన పాత్రలో రవీందర్, సిరి నటించారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నిర్మల్: మద్యానికి బానిసైన యువకుడు జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..నర్సాపూర్(జి) మండలం కుస్లీ గ్రామానికి చెందిన తోకల చిన్న సాయిలు (28) గత నాలుగేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెందాడు. ఆదివారం గ్రామంలోని క్రీడా ప్రాంగణం బోర్డుకు ఉరేసుకున్నాడు. గ్రామస్తురాలు ముచ్చల గంగామణి గమనించి మృతుడి అన్న నడిపి సాయిలుకు సమాచారం అందించింది. నడిపి సాయిలు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**కడుపునొప్పి భరించలేక వృద్ధుడు..**



లక్ష్మారెడ్డి (ఫైల్)

బోథ్: కడుపునొప్పి భరించలేక వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీసాయి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు దాసరి లక్ష్మారెడ్డి (76) గత కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గతనెల 31న నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని వచ్చాడు. ఎంతకీ కడుపు నొప్పి తగ్గలేదు. ఆ బాధ భరించలేక ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య భోజాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**పురుగుల మందు తాగి యువకుడు..**

సిరికొండ: మతిస్థిమితం కోల్పోయి యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై కాంత్లే రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన కినక జుగదీరావ్(26) గతకొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. శనివారం ఉదయం తల్లి గమనించి వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

**తల్లి మందలించిందని యువతి..**



రీమా మండల్ (ఫైల్)

చింతలమానెపల్లి: తల్లి మందలించిందని యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని రవీంద్రనగర్–2 గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ఇస్లావత్ నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని రవీంద్రనగర్–2 గ్రామానికి చెందిన రీమా మండల్(20) ఇంటర్ విద్య అనంతరం హైదరాబాద్‌లో ఉన్నత చదువుల కోసం వెళ్లింది. అక్కడ ఆర్థిక పరిస్థితి అనుకూలించక పోవడంతో తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఆదివారం ఉదయం తల్లి రంజితతో ఆమెకు వాగ్వాదం చోటు చేసుకుంది. తల్లి తీవ్రంగా మందలించింది. ఇరువురి మధ్య పెనుగులాట చోటు చేసుకోగా రీమా ఆవేశానికి లోనైంది. తల్లి, మరో సోదరి ఉన్న గదికి గడియ పెట్టి పక్కన ఉన్న మరో గదిలో ఉరేసుకుంది. గడియ పెట్టిన విషయాన్ని ఫోన్ ద్వారా పొరుగు వారికి తెలియజేయగా వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే రీమా మండల్ మృతిచెందింది. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మిలింద్ కుమార్ (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గోడ్కే మిలింద్ కుమార్ (38) చికిత్సపొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మిలింద్ కుమార్ ఇచ్చోడలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్తుండగా దేవాపూర్ వద్ద రోడ్డు పక్కన బైక్‌తో సహా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలిస్తుండగా ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

**చుచుంద్‌లో ఒకరు..**

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామానికి చెందిన మహాలింగి పోశెట్టి(47) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోశెట్టి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రి ఖర్చుల కోసం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక మదనపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు భైంసాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య మహాలింగి కవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ప్రాణం తీసిన బీడీ అలవాటు

- నిర్మల్ జిల్లా దేవునిగూడెంలో ఘటన



వేల్పుల లింగన్న(ఫైల్)

దస్తురాబాద్: బీడీ తాగే అలవాటు ఓ వృద్ధుడిని సజీవ దహనం చేసింది. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం దేవునిగూడెంలో జరిగింది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెల్పుల లింగన్న(80)కు కంటిచూపు సరిగా ఉండదు. కూతురు రమ్య ఇంట్లో ఉంటున్నాడు. బీడీ తాగే అలవాటు ఉన్న లింగన్న శనివారం రాత్రి, లింగన్న బీడీ తాగేందుకు అగ్గి వెలిగించుకున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు దుప్పట్లకు అంటుకుంది. మంటలు చెలరేగి సజీవ దహనమయ్యాడు.

తెల్లవారుజామున కుటుంబ సభ్యులు చూసే సరికి, లింగన్న పూర్తిగా కాలిపోయి ఉన్నాడు.కూతురు రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఖానాపూర్ ప్రభుత్వ వైద్యులు సంఘటనా స్థలంలోనే పోస్ట్‌మార్టం నిర్వహించారు.

## వలలో చిక్కిన కొండచిలువ



పెరట్లో వలలో చిక్కిన కొండచిలువ



కొండ చిలువని బంధిస్తున్న అటవీశాఖ అధికారి

భీమారం: మండలంలోని లాల్‌బహదూర్‌పేటలో రైతు కొత్తపల్లి లచ్చిరెడ్డి పెరట్లో కూరగాయల మొక్కల రక్షణ కోసం చుట్టూ ఏర్పాటు చేసిన వలలో శనివారం రాత్రి కొండచిలువ చిక్కింది. ఇంటి పరిసరాల్లో వచ్చిన కొండచిలువ పెరట్లో వల వద్దకి వెళ్లి చిక్కుకుంది. ఈ విషయాన్ని గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని చాకచక్యంగా దాన్ని బంధించి ఎలకేశ్వరం సమీపంలోని 315 కంపార్ట్‌మెంట్ అడవిలో వదిలిపెట్టారు.

## మరుగుదొడ్డి నిర్వాహకుడిపై హత్యాయత్నం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన మరుగుదొడ్డి నిర్వహిస్తున్న రామ్‌కుమార్ పాండే (62)పై హత్యాయత్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం నిద్రలేచిన పాండే తన డ్యూటీలో ఉన్నాడు. అప్పటికే పాండేను హత్య చేయాలనుకున్న యువకుడు అదును చూసి ఒక్కసారిగా పదునైన కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. పాండే తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స అందజేశారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

**హత్యాయత్నానికి పాల్పడింది అతనే?**

రామ్‌కుమార్ పాండే వద్ద బిహార్‌కు చెందిన గోలు శర్మ (అలియాస్ ఆనంద్ కుమార్) కొన్ని నెలలుగా పనిచేస్తున్నాడు. సహచరుడే హత్యకు యత్నించడం స్థానికులకు భయాందోళనకు గురిచేసింది. హత్యాయత్నం చేసింది అతనే అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన తర్వాత గోలు శర్మ కనిపించకపోవడంతో హత్యాయత్నంగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారి రాజు తెలిపారు.

## పశుమాంసం పట్టివేత



పశుమాంసం శాంపిళ్లు సేకరిస్తున్న అధికారులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామం మీదుగా ఆటోలో తరలిస్తున్న పశుమాంసాన్ని బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పట్టుకున్నారు. కడెం నుంచి గోవధ చేసి తీసుకువస్తున్నారని సమాచారంతో ఆటోను పట్టుకున్నట్లు జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ తెలిపారు. వారు ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి ఎస్సై రాహుల్ గైక్వాడ్ చేరుకున్నారు. వెటర్నరీ ఇన్‌చార్జి మండల అధికారి సౌందర్యతో పోస్టుమార్టం నిర్వహించారు. పశుమాంసం శాంపిళ్లు సేకరించి ఆవుదా, ఎద్దుదా అని నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. ఆటోడ్రైవర్ మహమూద్‌పై కేసు నమోదు చేసి, ఆటోను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కడెం మండల కేంద్రంగా గత ఆరు నెలలుగా ఆవులను వధిస్తూ వివిధ ప్రాంతాలకు మాంసాన్ని తరలిస్తున్నారని జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ ఆరోపించారు. ఆటో వెనక భాగంలో సైతం ఇతర దేశానికి చెందిన జెండాతో ఉన్న వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పడాల రాజశేఖర్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, నాయకులు పంబాల శ్రీకాంత్, భూమేశ్, సాయిప్రణీత్, ప్రతాప్, ప్రశాంత్, శ్రీకాంత్, సాయికిరణ్, విన్ను, సనత్, నాగేంద్ర ఉన్నారు.

## 22 ఏళ్ల తర్వాత ఇంటికి..

- చించోలి(బి)కి చెందిన యువకుడు
- 16 ఏళ్ల వయస్సులో మతిస్థిమితం లేక వెళ్లి..
- ఇటీవల స్వచ్ఛంద సంస్థకు వివరాలు వెల్లడి
- కుటుంబ సభ్యులకు అప్పగింత



మల్లయ్య

సారంగపూర్: 16 ఏళ్ల వయస్సులో మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిన యువకుడు 22 ఏళ్ల తర్వాత తిరిగివచ్చాడు. స్థానికులు, హైదరాబాద్‌లోని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాలు.. మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన గొల్ల నడిపి లింగయ్య గత 34 ఏళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లాడు. అప్పటికే ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందులో చిన్నకుమారుడు మల్లయ్య చిన్నతనం నుంచే మతిస్థిమితం లేకుండా బయట తిరుగుతూ ఉండేవాడు. అతనికి 16 ఏళ్ల వయస్సులో ఎక్కడికో వెళ్లిపోయాడు. తల్లి మల్లవ్వ, అక్కలు, అన్నయ్య అతని కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. ఆయన సోదరుడు ఇటీవల మృతి చెందాడు. ఈక్రమంలో ఆకస్మాత్తుగా హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థకు ఇటీవల సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సదరు యువకుడు మల్లయ్య (38) కనిపించాడు. తన కుటుంబ వివరాలు తెలపడంతో ఆదివారం చించోలి(బి) గ్రామానికి తిరిగి తీసుకువచ్చి కుటుంబీకులకు అప్పగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. కుటుంబీకుల ఆధ్వర్యంలో అతన్ని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం.